క్లుప్తంగా

టిడ్కో ఇళ్లకు నీటి సరఫరా పనులు

మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



గుడివాడ టౌన్: పంపిణీకి సిద్ధంగా ఉన్న టిడ్కో గృహాలకు తాగునీటిని అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రధాన పైప్‌లైన్ జాయింట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంపునకు ఈ పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు. వాటి నుంచి అన్ని బ్లాకుల ఓవర్ హెడ్ ట్యాంకుల మోటార్ల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామని వివరించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలో శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన గృహిణి పొట్టే కృష్ణమూర్తి భార్య శకుంతల (103) అకస్మాత్తుగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు కుమారుడు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో శ్రీ చైతన్య ఈటెక్నో స్కూల్ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో తమ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ ఎంపికలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఎంకామ్ పూర్తి చేసిన 50 మంది ఇటర్వ్యూలో పాల్గొనగా 19 మంది ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్ శంకర్, వైస్ ప్రిన్సిపల్ ఎం.శివనాథ్, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా రాజగోపాల స్వామి కల్యాణం



మండవల్లి: మండలంలోని అల్లినగరంలో రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, పంచామృత స్నపన, అభిషేకం, అగ్నిప్రతిష్ఠాపన, మూర్తిహోమం, మహాశాంతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు గౌతమ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ విద్యకు పట్టం

- 'పది'లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ప్రతిభ చూపిన ఆణిముత్యాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- ప్రభుత్వ విద్యారంగ చరిత్రలో తొలిసారి



పిన్నమనేని యశస్విని (574)



బలుసు మహేష్ (574)



వి.నయన చౌదరి (574)



షబానాబేగం (574)

గుడివాడ టౌన్: గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. ప్రభుత్వ విద్యారంగ చరిత్రలో ఇది తొలిసారి. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం. పేద పిల్లలకే పరిమితమైన ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆణిముత్యాలు పురస్కారాలను అందించనుంది. ఈనెల 25వ తేదీ జరగనున్న ఈ కార్యక్రమానికి గుడివాడ నియోజగవర్గానికి చెందిన ఆరుగురు ఎంపికైనట్లు ఎంఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్ తెలిపారు. నియోజకవర్గం లోని అర్బన్, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కేవలం పురపాలక సంఘ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఈ పురస్కారాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

ఆణిముత్యాలు వీరే..

ఏజీకే హైస్కూల్‌కు చెందిన కోటి అక్షయ 579 మార్కులు సాధించి నియోజకవర్గ ప్రథమస్థానం సాధించింది. ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలకు చెందిన సాలపు లక్ష్మీప్రసన్న 577 మార్కులు సాధించి ద్వితీయస్థానం, ఏజీకే హైస్కూల్‌కు చెందిన పిన్నమనేని యశస్విని 574, ఏజీకే హైస్కూల్‌కే చెందిన బలుసు మహేష్ 574, ఎస్‌పీఎస్ హైస్కూల్‌కు చెందిన వి.నయనచౌదరి 574, ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలకు చెందిన షబానాబేగం 574 మార్కులు సాధించి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు.

జూనియర్ కళాశాల స్థాయిలో నలుగురు..

పామర్రు: పామర్రు నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలోని నాలుగు గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలుగా ఈనెల 25న ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు పామర్రు ఎంఈవో పి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలోని నిమ్మకూరులో ఏపీ గురుకుల కళాశాల, మొవ్వ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన నలుగురు విద్యార్థులను ఆణిముత్యాలుగా ప్రకటించి ప్రోత్సాహకాలు అందించనుననట్టు తెలిపారు. నిమ్మకూరులోని ఏపీఆర్‌జేసీకి చెందిన డి.అంజిరెడ్డి ఎంపీసీ గ్రూపులో 1000కి 968 మార్కులు సాధించి గ్రూపులో ప్రథమస్థానం సాధించాడు. బైపీసీలో ఏపీఆర్‌జేసీ నిమ్మకూరు విద్యార్థి ఎస్.శివారెడ్డి 1000కు 971 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. హెచ్ఈసీ గ్రూపులో మొవ్వ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.తేజస్వీని 1000 మార్కులకు 674 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. సీఈసీ గ్రూపులో మొవ్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలకుచెందిన కె.రాజబాబు 1000 మార్కులకు 914 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో ఉన్నారని తెలిపారు. వీరికి ఒకొక్కరికి ప్రభుత్వం నుంచి రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలను అందజేయటం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచడం, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం వంటి ప్రోత్సాహాలు సకాలంలో అందించడం, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం మాకు ప్రోత్సాహాన్నిచ్చాయి. కష్టపడి చదివాం. ఉత్తమ ఫలితాలు సాధించాం. ఇలాంటి ప్రోత్సాహకాలు పేద విద్యార్థులకు సాయపడతాయి.

–కోటి అక్షయ (నియోజకవర్గ ఫస్ట్ : 579)

సౌకర్యాలు కల్పించటం వల్లే..



పాఠశాల ప్రారంభం నాటి నుంచే మాకు కావలసిన పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రారంభం నుంచి చదువుకో డానికి ఏవిధమైన అడ్డంకులు ఏర్పడలేదు. ఉపాధ్యాయులు సైతం మమ్ములను ఎంతగానో ప్రోత్సహించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేశారు.

–సాలపు లక్ష్మీప్రసన్న (నియోజకవర్గంలో ద్వితీయ : 577)

భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాలు..



గతంతోపోలిస్తే బోధనా విధానం మారింది. ప్రభుత్వ సూచనలు అమలు చెయ్యడంలోవిద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు సమష్టి కృషి చేశారు. పురపాలక సంఘ పాఠశాలల్లో వీటి ప్రాధాన్యత కన్పించింది. పాఠశాలల్లో సౌకర్యాలు కూడా మెరుగయ్యాయి. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాలు విద్యార్థులు సాధిస్తారు.

–బీఎస్‌సీ శేఖర్‌సింగ్, ఎంఈఓ, గుడివాడ

వలంటీర్లు సైనికుల్లా సేవలందించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



వలంటీర్ల సత్కారసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: గ్రామ వలంటీర్లు సైనికుల్లా సేవలందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 సచివాలయాల వలంటీర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజల్లో ఎంతో అభిమానం సంపాదించుకున్న వలంటీర్లను ప్రతిపక్ష నేతలు పలు రకాల విమర్శలతో పాటు అవహేళన చేయడం దారుణమన్నారు. అయినప్పటికీ జగనన్న ఇచ్చిన భరోసాతో సేవాభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి జగనన్న సేవలకు ప్రతిఫలంగా సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర వంటి పురస్కారాలతో వలంటీర్లను గత మూడేళ్లుగా సత్కరిస్తున్నట్లు చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో విధులను నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, రాచూరి రాధా, ఎంపీటీసీ సభ్యులు మరీదు నాగయ్య, కోటే ప్రవీణ్, రెడ్డి సతీష్, దూసనపూడి లక్ష్మీకుమారి, పేరం నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు శీలం రామకృష్ణ, కరేటీ గోవిందరాజులు, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషబాబు, సర్పంచ్‌లు సుశీలమ్మ, మరీదు దుర్గశ్రీ, సైదాల శ్రీను, చిట్టూరి నాంచారయ్య, మొవ్వ జయలక్ష్మీ, దాసరి కాశీ అన్నపూర్ణ, మంచాల సరస్వతీ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ పాల్గొన్నారు.

రోటరీ వితరణ




పమిడిముక్కల: ఉయ్యూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంటాడ గ్రామానికి చెందిన ఎం.దుర్గాశివ నాగమణికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రోటరీ క్లబ్‌కు నాగమణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాత పులి శ్రీనివాసరావు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, నాగసుబ్రమణ్యం, వసంతరావు, ఆర్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డ రోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోని హుండీలను ఈనెల 24వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, సేవా సభ్యులు పాల్గొంటారని తెలిపారు. భక్తులు ఈ హుండీ లెక్కింపులో పాల్గొన వచ్చన్నారు.

పార్టీ ప్రాభవాన్ని పెంచేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుకర్ జీ

పామర్రు: బీజేపీ ప్రాభవాన్ని గ్రామాల్లో విస్తరించేలా శ్రమించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుకర్‌జీ అన్నారు. బీజేపీ కృష్ణా జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం స్థానిక పాల శీతల కేంద్రం కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జూన్ నెలఖారు వరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. జిల్లా స్థాయిలోని 33 మండలాలకు నలుగురు వ్యక్తులను నియమించి పార్టీ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించే బాధ్యతలను అప్పగించామని అన్నారు. జిల్లా స్థాయిలో రానున్న కాలంలో 6 కార్యక్రమాలను జిల్లా ప్రచార కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించాలని అన్నారు. ఈనెల 30, 31తేదీల్లో ప్రెస్ కాన్ఫరెన్సును నిర్వహించి మోదీ 9 ఏళ్ల పాలన గురించి వివరించాలని అన్నారు. తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. కృష్ణాజిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తికొండ శ్రీ రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ జిల్లా ఇన్‌ఛార్జి ఉన్నమట్ల కబర్ధి, తపన చౌదరి, పామర్రు నియోజకవర్గ కన్వీనర్ పొట్లూరి కృష్ణబాబు, కో కన్వీనర్ కొల్లూరి రమేష్‌బాబు, పామర్రు మండల పార్టీ అధ్యక్షులు యార్లగడ్డ రమేష్‌బాబు, ఇతర మండలాల అధ్యక్షులు, భారతీయ జనతాపార్టీ నాయకులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులు

మండవల్లి: మండవల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయిన్‌లలో నీరు నిలచి రహదారులపై కూడా వర్షం నీరు నిలవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం పొక్లెయిన్ ద్వారా డ్రెయిన్లను శుభ్రం చేయించి, రహదారులపై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



కోనేరుసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న కదిరి – లేపాక్షి 1812 రకం విత్తనాలను రైతులు తీసుకుని అధిక దిగుబడులు సాధించాలని కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ రైతులకు సబ్సిడీపై కదిరి–లేపాక్షి వేరుశనగ విత్తనాలను మంగళవారం అందజేశారు. కానూరులో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావు రైతులకు సబ్సిడీ విత్తన సంచులను అందజేసి మాట్లాడారు. మండల వ్యవసాయ శాఖాధికారి జీవీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చూడామణి, వీఏఏలు మహాలక్ష్మి, ప్రసన్న, ఖాసీం ఝాన్సీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి

కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మార్కుల జాబితాను సకాలంలో అందజేసేందుకు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్ఎల్‌బి, ఫార్మసీ, బీఈడీ, స్పెషల్ బీఈడీ, పీజీ తదితర కోర్సులకు సంబంధించిన మార్కుల జాబితా జారీ విషయంలో జరుగుతున్న ఆలస్యం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట బాబు, జోగి శివ, పామర్తి బాల, పుట్టి రాజశేఖర్, ఎం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ఆనందబాబు

మండవల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ బి.ఆనందబాబు మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కేవైసీలు, పింఛన్‌లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో వలంటీర్లకు జరపాల్సిన పురస్కారాలు, జూన్ 5 వరకూ జరపాల్సిన పర్యావరణ పక్షోత్సవాల నిర్వహణ, ఆధార్ క్యాంపుల వేదికల నిర్ణయం, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

విశ్వసనీయతకు మారు పేరు జగన్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- సూరసానిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

మంత్రిపాలెం(మొవ్వ): అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలతో పాటు.. ప్రజా ప్రయోజనాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలిచిందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం మంత్రిపాలెం శివారు సూరసానిపల్లిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలెంటీర్లతో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను తెలియజేశారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ అందరి సంక్షేమం, అభ్యున్నతికై కృషి చేస్తున్నారన్నారు. వలెంటరీ, సచివాలయ వ్యవస్థలను ప్రవేశ పెట్టి ప్రభుత్వ పథకాలను ఇంటి ముగింటకే అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కైలే అనిల్ దృష్టికి ప్రజలు అంతర్గత రహదారులు కావాలని, విద్యుత్ స్తంభాలు, ఇళ్ల స్థలాలు, పింఛన్, హౌసింగ్ రుణాలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీలు కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), ఎంపీటీసీ కాకుమాను శ్రీలక్ష్మి, సర్పంచ్ పంది కృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వైస్ సర్పంచ్ కే లక్ష్మయ్య, గ్రామ కన్వీనర్ చిలుకోటి కోటయ్య, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సూరసానిపల్లి(మొవ్వ): మంత్రిపాలెం పరిధిలోని సూరసానిపల్లికి నిడుమోలు లాకులు నుంచి వచ్చే 1.6 కిలోమీటర్ల పొడవున్న రోడ్డు నిర్మాణానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీన గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజలకు రోడ్డు నిర్మిస్తామని మాట ఇచ్చారు. చెప్పిన విధంగా నిధులు కేటాయించి మంగళవారం ఉదయం జంగిల్ క్లియరెన్స్, పికింగ్ పనులు ప్రారంభించారు. రూ.5 లక్షల మండల పరిషత్ నిధులు, రూ.70 లక్షల ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులతో రోడ్డు నిర్మాణం వచ్చే నెలలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి పక్ష నాయకులు కేవలం మాటలు మాత్రమే చెబుతారని, అభివృద్ధి పనులు చేసేది తామేనని స్పష్టం చేశారు. డీఈ టీ శ్రీనివాసరావు, ఏఈ బి.రామారావు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ



జమీగొల్వేపల్లిలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం నాకు నచ్చిన పుస్తకం, పుస్తక సమీక్ష అనే అంశంపై కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వినాగ సురేష్, మహిళా మండలి సభ్యులు పాటిబండ పద్మావతి, స్థానికులు సీహెచ్ చంద్రశేఖర్ అజాద్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పామర్రులోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు జాతీయ గీతాలు, నీతికథలు చదివించారు. గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంతాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్ వంటి క్రీడలు నిర్వహించి విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఉపాధ్యాయుడు బాబురావు స్పోకెన్ ఇంగ్లిషు బోధించగా సీహెచ్ నాగరాజు నీతి కథలను బోధించి వాటి భావాన్ని వివరించారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం విజ్ఞాన శిబిరం కొనసాగింది. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఇంగ్లిషు కమ్యూనికేషన్ స్కిల్స్, స్టోరీలు, డిక్టేషన్ పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులన్నారు. వీటి ద్వారా ఉన్నత శిఖరాలు చేరుకొన్న మహా పురుషులు ఎందరోఉన్నారని తెలిపారు. చిరుప్రాయం నుంచి గ్రంథాలసారాన్ని గ్రహించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రభుత్వం అందించిన లే అవుట్లలో లబ్ధిదారులు వేగంగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఏలూరు రోడ్ శివారు జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. నూతన టెక్నాలజీతో ఆర్త నిర్మాణ సంస్థ ఇంటి నిర్మాణాలు చేపడుతోందని తెలిపారు. లబ్ధిదారులు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వచ్చిన ఆర్త నిర్మాణదారులతో కలిసి ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు.

గ్రామానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

కైకలూరు: మేజర్ పంచాయతీ ఆటపాక గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఆటపాక గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం, తాగు నీటి చెరువు తవ్వకంపై శివాలయం వద్ద గ్రామస్తులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. కమ్యూనిటీ హాలు గ్రామస్తులందరికీ త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి చెరువు పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జాన్ విల్సన్, బావిశెట్టి పాము, రమేష్, సింగంశెట్టి రాము, వడ్లాని సుబ్బారావు, రామిశెట్టి బుజ్జి, చిల్లిముంత శ్యామల రావు పాల్గొన్నారు.